సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 23 । నవంబర్ । 2023



చీనీ టన్ను రూ.28 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.25
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.25 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.17 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.4°/20.9°
జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. పగలు ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

భక్తుల సౌకర్యార్థం 70 ప్రత్యేక బస్సులు



ప్రత్యేక కౌంటర్‌ను పరిశీలిస్తున్న డిపో మేనేజర్ ఇనయతుల్లా

పుట్టపర్తి టౌన్: సత్యసాయి బాబా 98వ జయంత్యుత్సవాలకు విచ్చేస్తున్న భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనయతుల్లా పేర్కొన్నారు. ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, విజయవాడతో పాటు పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం 70 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. రద్దీని బట్టి సర్వీసులు పెంచుతామన్నారు. పుట్టపర్తి రైల్వేస్టేషన్- పుట్టపర్తి 10, కొత్తచెరువు- పుట్టపర్తి- బుక్కపట్నం 10, ధర్మవరం రైల్వేస్టేషన్- పుట్టపర్తి 10, కదిరి- పుట్టపర్తి 10, హిందూపురం- పుట్టపర్తి 10, పెనుకొండ- పుట్టపర్తి 5, అనంతపురం - పుట్టపర్తి 10, చెన్నై- పుట్టపర్తి 2, హైదరాబాద్- పుట్టపర్తి 2, బెంగుళూరు- పుట్టపర్తి 2 సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏసీబీ వలలో సబ్ రిజిస్ట్రార్

- రూ. 10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ శ్రీనివాస నాయక్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ అధికారులు

పుట్టపర్తి: బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస నాయక్ రూ. 10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి, సీఐ శాంతిలాల్ ప్రభాకర్ తెలిపిన మేరకు.. పుట్టపర్తి టౌన్ పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన సురేంద్ర రెడ్డి తన సోదరులతో కలిసి ఉన్న ఉమ్మడి ఆస్తిలో తన వంతు భాగాన్ని రిజిస్టర్ చేయించుకోవాలని సబ్ రిజిస్ట్రార్‌ను ఆశ్రయించాడు. స్టాంప్ డ్యూటీ తగ్గించుకుంటామని, తనకు రూ.50 వేలు లంచం ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్ డీల్ కుదుర్చుకున్నాడు. బుధవారం రాత్రి సురేంద్ర రెడ్డి అడ్వాన్స్‌గా సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ నాయక్‌కు రూ. 10 వేలు, ఆయన భార్యకు రూ. 10 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని, కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకుని అనంతపురం తరలించారు.

వాటర్‌షెడ్ గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



వెంగళమ్మచెరువులో పశువులకు వైద్యం అందిస్తున్న వైద్యాధికారులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని వాటర్‌షెడ్ గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పశువులకు వైద్యం అందిస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి శుభదాస్ పేర్కొన్నారు. మొదటి విడతలో పుట్టపర్తి మండలంలోని వెంగళమ్మ చెరువు, వీరాంజనేయపల్లి, చెర్లోపల్లి, కంబాలపర్తి, బొంతలపల్లి అమగొండపాళ్యం గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆవులు, గేదెల రోగాలు, చూడికి వచ్చిన పశువులకు గర్భం దాల్చడానికి సూది మందు, దూడలకు నట్టల నివారణ మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఒక్కో గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించే పశు వైద్య శిబిరంలో మొదటి రోజు పశువులకు, రెండో రోజు గొర్రెలు, మేకలకు వైద్యం అందజేయనున్నట్లు చెప్పారు. ప్రతి పాడి రైతు వైద్య శిబిరానికి వచ్చి అవగాహన పొందాలని సూచించారు.

విశేష స్పందన

బుధవారం పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువులో నిర్వహించిన విశేష స్పందన లభించినట్లు జిల్లా పశువైద్యాధికారి శుభదాస్ వెల్లడించారు. వైద్య శిబిరాలపై ముందస్తుగా రైతులకు తెలియజేస్తామన్నారు. గ్రామాల్లో చాటింపులు వేయిస్తామన్నారు. పశువైద్యాధికారులు శ్రీహరి నాయక్, క్రిష్ణచైతన్య, వాటర్ షెడ్ అధికారులు ప్రాజెక్టు ఆఫీసర్ రవీంద్రరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, శంకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, సత్యసాయి విద్యాసంస్థల సిబ్బంది



విద్యార్థికి పట్టా అందజేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, చిత్రంలో గవర్నర్ నజీర్, మంత్రి ఉషశ్రీ చరణ్

అంబరం.. విద్యా సంబరం

- ఘనంగా సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు
- 21 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం
- విద్యార్థులు జాతి నిర్మాణానికి పాటుపడాలని పిలుపు



రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న ఆర్‌జే రత్నాకర్



సత్యసాయి మహాసమాధి వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి

ప్రశాంతి నిలయం: కష్టపడి చదివారు. సత్తా చాటారు. విలువలు నింపుకున్నారు. సాక్షాత్తూ దేశ ప్రథమ పౌరురాలితో ప్రశంసలందుకుని మురిసిపోయారు. తమ పిల్లలు పట్టాలందుకుంటుండగా ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. పుట్టపర్తిలోని సాయి హీరా కన్వెన్షన్ హాల్ ఆ మధుర క్షణాలకు వేదికైంది. బుధవారం సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. వేద పండితుల వేదఘోష.. విద్యార్థుల సాయినామస్మరణ.. వక్తల దివ్య ప్రసంగాలు వెరసి ఆద్యంతం అంగరంగ వైభవంగా సాగాయి. సత్యసాయి జయంత్యుత్సవాల్లో భాగంగా నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. స్నాతకోత్సవంలో ముందుగా సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ గవర్నింగ్ బాడీ సభ్యులు వేదిక వద్దకు బ్రాస్ బ్యాండ్ నడుమ చేరుకున్నారు. సత్యసాయి డీమ్డ్ వర్సిటీ వైస్ చాన్సలర్ రాఘవేంద్ర ప్రసాద్ ఉత్సవాన్ని ప్రారంభించాలని ఫౌండర్ చాన్సలర్ అయిన సత్యసాయిని అభ్యర్థించగా, 'ఐ డిక్లేర్ కాన్వొకేషన్' అని ఆయన అనుమతిచ్చినట్లుగా డిజిటల్ స్క్రీన్ నుంచి ప్రకటించారు. అనంతరం వైస్ చాన్సలర్ హోదాలో ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్ సత్యసాయి విద్యాసంస్థల్లో బోధన, పరిశోధన, అభివృద్ధిని వివరిస్తూ ప్రారంభోపన్యాసం చేశారు.

ఆధునిక విద్యతో అత్యుత్తమ ఫలితాలు..

సత్యసాయి ఆశయాలకు అనుగుణంగా ఆధునిక విద్యావిధానాన్ని అనుసరిస్తూ దేశీయంగా, అంతర్జాతీయంగా సత్యసాయి విద్యాసంస్థలు శాస్త్ర, సాంకేతిక, పరిశోధనా రంగాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. ప్రశాంతి నిలయం, ముద్దెనహళ్లి, బృందావనం, అనంతపురంలోని నాలుగు క్యాంపస్‌ల ద్వారా పలు కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా డీప్ లెర్నింగ్, బాటం కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీస్ కోర్సులు ప్రవేశపెట్టి పరిశోధనలను ప్రోత్సహిస్తున్నామన్నారు. అత్యాధునిక సెంట్రల్ లేబొరేటరీ ద్వారా జెనోమిక్, యాంటీ క్యాన్సర్ డిసీజెస్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, అట్మాస్ఫియరిక్ కెమిస్ట్రీ రంగాల్లో పరిశోధనలు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా నాలుగేళ్ల కోర్సులు ప్రారంభించామన్నారు.తమ విద్యార్థులు, సిబ్బంది 140 పరిశోధనా పేపర్లు, 7 బుక్ చాప్టర్లు ప్రచురించినట్లు వెల్లడించారు. దేశ, విదేశాల్లో నిర్వహించిన 300 వెబినార్లు, ట్రైనింగ్ కార్యక్రమాలు, సెమినార్లలో పాల్గొన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, జీ-20 తదితర కార్యక్రమాల్లో భాగస్వాములమయ్యామన్నారు. విద్యార్థులతో కాన్వొకేషన్ ప్రతిజ్ఞ చేయించారు.

జాతి నిర్మాణానికి పాటు పడండి ..

ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసం, సానుకూల దృక్పథంతో సాగుతూ జాతి నిర్మాణానికి పాటు పడాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. స్నాతకోత్సవంలో విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. ధర్మాన్ని పాటిస్తూ ఉత్తమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఆధ్యాత్మికంగా ఉన్నతంగా ఉండేలా జీవన విధానాన్ని రూపొందించుకోవాలని కోరారు. విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ విలువలు, ఆధ్యాత్మిక సమ్మిళితమైన ఆధునిక విద్యను అందిస్తున్న సత్యసాయి విద్యాసంస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ధర్మో రక్షతి, రక్షితః అన్న సిద్ధాంతాన్ని పాటించాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని అత్యుత్తమ భవిష్యత్తును పొందాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. వివిధ కోర్సుల్లో ప్రతిభ చాటిన 21 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. పరిశోధనలతో ఉత్తమ ఫలితాలు సాధించిన 14 మందికి డాక్టరేట్లు, 560 మందికి డిగ్రీ పట్టాలు పంపిణీ చేశారు. చివరిగా చాన్సలర్ హోదాలో ప్రొఫెసర్ చక్రవర్తి 'ఐ క్లోస్ ది కాన్వొకేషన్' అని ప్రకటించారు. జాతీయ గీతాలాపనతో స్నాతకోత్సవం ముగిసింది.

ఘన సన్మానం..

వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు దుశ్శాలువ, సత్యసాయి జ్ఞాపికతో సన్మానించారు. గవర్నర్ నజీర్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద, రాష్ట్ర ప్రభుత్వం తరఫున వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఉషశ్రీ చరణ్‌ను ట్రస్ట్ సభ్యుడు మోహన్ సత్కరించారు. వేడుకల్లో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, పలువురు సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు, సత్యసాయి విద్యాసంస్థలు, సేవా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సత్యసాయి జయంతి

ప్రశాంతి నిలయ: సత్యసాయి 98వ జయంతి వేడుకలు ప్రశాంతి నిలయంలో గురువారం ఘనంగా జరగనున్నాయి. దేశ విదేశాలకు చెందిన సత్యసాయి భక్తులు పెద్ద ఎత్తున పుట్టపర్తి చేరుకున్నారు. వేడుకలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. సత్యసాయి మహాసమాధి, సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేక పుష్పాలతో తీర్చిదిద్దారు. ఉదయం 8 గంటలకు విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. ప్రశాంతి భజన బృందం సంగీత కచేరీ ఉంటుంది. వేడుకల సందర్భంగా ట్రస్ట్ ఆదాయ వ్యయాలను వివరించే 2022-23 వార్షిక నివేదికను సమర్పిస్తారు. సత్యసాయి దివ్య బోధనలను డిజిటల్ స్క్రీన్లపై ప్రదర్శిస్తారు. సాయంత్రం ప్రశాంతి నిలయం పురవీధుల్లో స్వర్ణ రథోత్సవం నిర్వహిస్తారు. సాయికుల్వంత్ సభా మందిరంలో జోలోత్సవం ఉంటుంది. కౌశిక్ చక్రవర్తి బృందం సంగీత విభావరి నిర్వహిస్తారు. మహా మంగళ హారతితో వేడుకలు ముగుస్తాయి.





గోల్డ్‌మెడల్స్ అందుకున్న విద్యార్థులతో రాష్ట్రపతి, గవర్నర్, మంత్రి, తదితరులు, రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ గవర్నింగ్ బాడీ సభ్యులు



గవర్నర్ నజీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

విద్యా ప్రదాత వైఎస్సార్

ఎస్కేయూలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: ప్రతిష్టాత్మకంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేసి పేదింటి పిల్లలకు ఉన్నత విద్యను చేరువ చేసిన విద్యాప్రదాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కొనియాడారు. పథకం కింద ఉచితంగా చదువుకుని ఎంతోమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) క్యాంపస్‌లో పాలక మండలి అనుమతితో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డితో కలిసి ఎంపీ, ఎమ్మెల్యేలు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం లా విభాగం నుంచి కామన్ మెస్ హాలు వరకు నిర్మించిన డబుల్ రోడ్డు, సరస్వతి హాస్టల్, లా విభాగం మూట్ కోర్టు, నక్షత్ర తోటను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ నాయకుడే కాదు మహోన్నత వ్యక్తి అని అభివర్ణించారు. 1982-83లో విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడే ఆయన విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. సీఎం హోదాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి లక్షలాది మంది పేదలు ఉచితంగా ఉన్నత విద్య అభ్యసించి, ప్రయోజకులయ్యే అవకాశం కల్పించారన్నారు. దివంగత నేత వైఎస్సార్ ఆశయాలను తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ వర్సిటీ.. సిబ్బంది-విద్యార్థుల కోసం అందించిన రెండు బ్యాటరీ కార్లను ఎంపీ, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కారులో క్యాంపస్‌లో సరదాగా ప్రయాణించారు. కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ బిడుదూరి గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగారెడ్డి, హేమంత్‌కుమార్, అంకె శ్రీనివాస్, ప్రొఫెసర్ శంకర్ నాయక్, టి.పురుషోత్తంరెడ్డి, కరాటే పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవలు వెలకట్టలేనివి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్

పుట్టపర్తి రూరల్: సత్యసాయిబాబా సేవలు వెలకట్టలేనివని ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వారు మీడియాతో మాట్లాడారు. శాంతియుతంగా, ప్రేమగా మెలగాలని బాబా ఇచ్చిన ఉపదేశం అందరికీ మార్గదర్శనమన్నారు. విద్య, వైద్య సంస్థలు, తాగునీటి పథకాల ఏర్పాటుకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. పుట్టపర్తిలో, బెంగళూరు వైట్ ఫీల్డ్‌లో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించి పేదలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారని కొనియాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోని కరువు ప్రాంతాల్లో కూడా తాగునీటి పథకం ద్వారా ప్రజల దాహార్తి తీరుస్తున్నారని తెలిపారు. విలువలతో కూడిన ఉచిత విద్యను లక్షలాది మందికి ప్రసాదిస్తున్నారన్నారు. ఆ మహనీయుడి జయంత్యుత్సవాల్లో పాల్గొనే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. సత్యసాయి జయంతి వేడుకలో పాల్గొనేందుకు లక్షన్నర నుంచి రెండు లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసిందన్నారు.

మడకశిర పోలీసుస్టేషన్ అప్‌గ్రేడ్



కొత్తగా ఏర్పాటు కానున్న రూరల్ పోలీసు సర్కిల్ పరిధిలోకి అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ పోలీసుస్టేషన్లు రానున్నాయి. అయితే, రూరల్ పోలీసు సర్కిల్ కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేస్తారో తెలియాల్సి ఉంది. త్వరలో దీనిపై స్పష్టత లభించనుంది.

మడకశిర: స్థానిక పోలీసుస్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మడకశిర కేంద్రంగా టౌన్ పోలీసు సర్కిల్‌తో పాటు కొత్తగా రూరల్ సర్కిల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం మడకశిర కేంద్రంగా ఉన్న పోలీసు సర్కిల్ పరిధి చాలా పెద్దగా ఉంది. మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం పోలీసుస్టేషన్లు సర్కిల్ పరిధిలో ఉన్నాయి. మడకశిర నుంచి అమరాపురం, అగళి పోలీసుస్టేషన్లు దాదాపు 42 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. రొళ్ల, గుడిబండ పోలీసుస్టేషన్లు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. పూర్తిగా కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉన్నాయి. ఈ 5 పోలీసుస్టేషన్లను ఒకే సీఐ పర్యవేక్షణ చేయాల్సి ఉంది. దీంతో పూర్తి స్థాయిలో విధులు నిర్వర్తించడానికి ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి మడకశిర పోలీస్‌స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసింది.

విస్తృతంగా సెబ్ దాడులు



తనకల్లు వద్ద పట్టుబడిన మద్యం బాక్సులు చూపుతున్న సెబ్ అధికారులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో 'సెబ్' (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) దాడులు కొనసాగుతున్నాయి. బుధవారం ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు తనకల్లు, మడకశిర సెబ్ స్టేషన్ల పరిధిలో దాడులు నిర్వహించారు. తనకల్లు సెబ్ స్టేషన్ పరిధిలో కమ్మవారిపల్లి క్రాస్ వద్ద 7 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుకున్నారు. ఒక కారు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. మడకశిర స్టేషన్ పరిధిలో 45 మద్యం ప్యాకెట్లు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

లేపాక్షి ఆలయ హుండీ లెక్కింపు

లేపాక్షి: ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయంలోని హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి నరసింహమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. 94 రోజులకు గాను రూ.2,35,818 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి నాగేంద్రుడు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అకాడమీని సందర్శించిన గవర్నర్



గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్ పోస్ట్ వద్ద ఉన్న రక్షా అకాడమీని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సందర్శించారు. బుధవారం ఉదయం శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు వెళుతూ ఉదయం రక్షా అకాడమీకి చేరుకున్న ఆయనకు తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, పరిగి తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, డీఎస్పీ కంజాక్షన్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కాసేపు విశ్రాంతి అనంతరం తిరిగి పుట్టపర్తికి బయల్దేరి వెళ్లారు.

పోలీసు స్టేషన్ ఆవరణలో చిరుత

రొళ్ల: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో మంగళవారం అర్ధరాత్రి ఓ చిరుత సంచరించింది. ఆ సమయంలో సెంట్రీ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ షఫీతో కలసి జమేదార్ రామలింగయ్య విధుల్లో ఉన్నారు. కుక్కల అరుపులు వినిపించడంతో బయటకు వచ్చిన వారు పోలీసుస్టేషన్ ఆవరణ నుంచి 10 మీటర్ల దూరంలో వెళుతున్న చిరుతను గమనించారు. చీకట్లో చిరుత సంచారం సీసీ పుటేజీల్లో నిక్షిప్తం కాలేదు. విషయాన్ని బుధవారం ఉదయం బహిర్గతం చేస్తూ చిరుత సంచారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పోలీసులు సూచించారు. పొలాల వద్దకు వెళ్లే రైతులు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

రాష్ట్రపతికి ఘన స్వాగతం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

పుట్టపర్తి రూరల్: సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు పుట్టపర్తికి విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విమానాశ్రయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ఒడిశాలోని జహర్సుగూడ విమానాశ్రయం నుంచి బయలుదేరిన రాష్ట్రపతి బుధవారం మధ్యాహ్నం 2.47 గంటలకు పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్) డా.శంకభత్ర బాగ్చీ, కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ మాధవ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహమ్మద్ ఇక్బాల్, మంగమ్మ, భూమిరెడ్డి రామగోపాలరెడ్డి, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ తిప్పేస్వామి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. సాయంత్రం ఆమె తిరుగు ప్రయాణమై వెళ్లారు.



మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, పీఆర్ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, అదనపు డీజీపీ డా.శంకభత్ర బాగ్చీ, కలెక్టర్ పి.అరుణ్‌బాబు,



ఎస్పీ మాధవ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహమ్మద్ ఇక్బాల్, ఎస్.మంగమ్మ, భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ తిప్పేస్వామి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

జనవాక్కు

కంటి చూపు బాగుపడింది



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద మన గ్రామానికి వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందజేశారు. మా గ్రామంలో కంటి చూపు సరిగా లేని వారిని పరీక్షించి, శస్త్రచికిత్సతో పాటు కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేశారు. నాకూ చూపు మందగించడంతో కళ్ల అద్దాలు ఇచ్చారు. ఇప్పుడు స్పష్టంగా చూడగలుగుతున్నా. ఇలాంటి ప్రభుత్వ సేవా కార్యక్రమాలు నేను ఎన్నడూ చూడలేదు. నిజంగా సీఎం వైఎస్ జగన్‌తో గ్రామీణ రోగులకు ఎంతో మేలు జరుగుతోంది.

– నాగప్ప వి.అగ్రహారం, అమరాపురం మండలం

ఇంటి వద్దకే పత్రాలు



గతంలో సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయం వద్దకెళ్లి గంటల కొద్దీ నిరీక్షించేవాళ్లం. అత్యవసరమని ప్రాధేయపడినా ఎవరూ పట్టించుకునేవారు కాదు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మాకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఇంటి వద్దనే పొందాం. ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు. పేదలకు ఉపయోగపడే ఎన్నో మంచి పథకాలు అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– చంద్రకళ, 19 వార్డు, ప్రశాంతి గ్రామం, పుట్టపర్తి

హాజరు శాతం పెరిగింది



ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గతంలో కంటే ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన మెరుగుపడింది. కార్పొరేట్ తరహాలో బడులను సీఎం వైఎస్ జగన్ తీర్చిదిద్దారు. పాఠశాలల ఆధునీకరణ, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ట్యాబ్‌లతో విద్యాబోధన, ప్రాథమిక విద్యలోనే కంప్యూటర్ శిక్షణ, అమ్మ ఒడి పథకం తదితరాలతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. తరగతి నిండా విద్యార్థులుండడంతో చదువు చెప్పేందుకు ఉపాధ్యాయులు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. ఫలితంగా పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ బడులు గణనీయమైన పురోగతి సాధిస్తున్నాయి. విద్యారంగంలో జగన్ సర్కార్ చేపట్టిన సంస్కరణలు విద్యాభివృద్ధికి దోహదపడ్డాయి.

– ఈశ్వర్, టీచర్, ఎ.కొత్తపల్లి, అమడగూరు మండలం

బోధనాప్రమాణాలు మెరుగు



విద్యారంగంలో జగన్ సర్కార్ అమలు చేసిన సంస్కరణల వల్ల బోధనాప్రమాణాలు మెరుగు పడ్డాయి. నిరుపేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులు చేరువయ్యాయి. 'మనబడి నాడు నేడు' కార్యక్రమంతో ప్రభుత్వ బడులు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి కనబరుస్తున్నారు. బయోమెట్రిక్ విధానం వల్ల సమయపాలన కచ్చితంగా పాటించగలుగుతున్నాం. దీంతో విద్యార్థుల హాజరు శాతం కూడా పెరిగింది. పోటీ ప్రపంచంలో నిరుపేద విద్యార్థులు సైతం రాణించేలా విద్యావ్యవస్థను జగన్ సర్కార్ తీర్చిదిద్దింది.

– సిరాజుద్దీన్, టీచర్, గోరంట్ల

ఐకమత్యంతోనే సమస్యలు దూరం

- జాతీయ చేనేత సంఘం అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్



మాట్లాడుతున్న బండారు ఆనందప్రసాద్

ధర్మవరం అర్బన్: ఐకమత్యంగా ఉన్నప్పుడే సమస్యలు దూరమవుతాయని చేనేతలకు జాతీయ చేనేత సంఘం అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ సూచించారు. ధర్మవరంలోని శమీ నారాయణస్వామి ఆలయంలో బుధవారం చేనేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని కులాల భాగస్వామ్యంతో చేనేత అభివృద్ధి బాటలో నడుస్తుండడం గర్వకారణమన్నారు. కొన్ని నెలల క్రితం ధర్మవరం పట్టు వ్యాపారులపై జరిగిన దాడిలాంటి ఘటనలు భవిష్యత్తులో చోటుచేసుకోకుండా ఉండేందుకు అందరూ ఐకమత్యంతో ఉండాలని సూచించారు. రాష్ట్రంలోని చేనేత పరిశ్రమను, వ్యాపారస్తులను, కార్మికులను, అనుబంధ సంస్థలను కాపాడుకునేందుకు ఈ నెల 25న ధర్మవరంలో రాష్ట్రస్థాయి చేనేతల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందరినీ సంఘటితం చేయడం, ఆర్థిక అభివృద్ధిని సాధించడం, రాజకీయాలలో ప్రత్యేకమైన చోటు దక్కించుకునే దిశగా సమావేశం సాగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత సంఘం అధ్యక్షుడు శివరాం ప్రసాద్, ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కోడిపల్లి రాజా, ధర్మవరం నాయకులు గిర్రాజు రవి, పల్లెం వేణుగోపాల్, జయశ్రీ, పోలా వెంకటనారాయణ, చేనేత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

అధిష్టాన నిర్ణయమే శిరోధారం

- ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

హిందూపురం: వైఎస్సార్‌సీపీ అధిష్టానం నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. పుట్టపర్తిలో జరిగిన శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకు రోడ్డు మార్గంలో వెళుతున్న ఆయనను కొడికొండ చెక్‌పోస్టు వద్ద హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు పరుశురాం, అయూబ్, ఇర్షాద్, ముస్తాక్, లతీఫ్, సలీం, ఎంపీటీసీ శెట్టిపల్లి జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, చిలమత్తూరు నాయకులు నాగరాజు, రాజారెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. అభద్రతాభావాన్ని వీడి అందరితో కలసి పనిచేయాలన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. అనంతరం పుట్టపర్తిలో కార్యక్రమం ముగించుకున్న ఆయన హిందూపురంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాలరెడ్డి, లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ ఉదయ్‌కుమార్, వీవర్స్ కాలనీ సలీం తదితర నాయకులను కలసి పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

భూమి చదునులో 'పచ్చ' రాజకీయం

- వైఎస్సార్‌సీపీ నేతలపై బురద చల్లడం మానుకోవాలి



బుక్కపట్నంలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి: భూమి చదును అంశంపై టీడీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తూ పచ్చపత్రికలను అడ్డు పెట్టుకుని అవాస్తవాలు రాయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. బుధవారం ఉదయం బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీతో పాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొత్తకోట కేశప్ప తదితరులు మాట్లాడారు. బుక్కపట్నం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1414లో 4.10 ఎకరాల మాన్యం భూమిని చదును చేసి ఆక్రమించుకుంటున్నట్లు పచ్చ పత్రికలు పని కట్టుకుని సాగిస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. వాస్తవాలు తెలుసుకుని కథనాలు ప్రచురించాలని హితవు పలికారు. ఆ భూమి చదును చేసింది జానకంపల్లికి చెందిన టీడీపీ మద్దతుదారులేనన్న విషయాన్ని మరువరాదన్నారు. విలువలతో కూడిన రాజకీయాలకు వైఎస్సార్‌సీపీ పెట్టింది పేరన్నారు. టీడీపీ నేతల ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి దోషులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సమావేశంలో కొత్తకోట ఎంపీటీసీ హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు చంద్రబాబు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూటీలోని రూ.17 లక్షలు మాయం

కదిరి టౌన్: స్కూటీలో ఉంచిన రూ.17 లక్షలను దుండగులు అపహరించుకెళ్లాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కదిరి నివాసి అస్రాఫ్‌వలి బుధవారం ఉదయం రూ.17 లక్షలు తన స్కూటీలో ఉంచుకుని స్టేట్ బ్యాంక్ వద్దకు చేరుకున్నాడు. కాసేపు బ్యాంక్ ఎదుట స్కూటీని ఉంచి పని చూసుకుని వచ్చేలోపు నగదు కనిపించలేదు. డబ్బు చోరీ అయినట్లు గుర్తించిన అస్రాఫ్‌వలి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు బ్యాంక్‌లోని సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.



విద్యుదాఘాతంతో వివాహిత మృతి

కనగానపల్లి(రాప్తాడు): రాప్తాడు మండలంలోని చిన్మయనగర్‌లో బుధవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై ఎరికల వరలక్ష్మి(42) మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... ఇంటి వద్ద మోటర్‌కు నీటి పైపును అమరుస్తుండగా విద్యుత్ ప్రసరించడంతో ఒక్కసారిగా ఆమె షాక్‌కు గురై కుప్పకూలింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త గంగాధర్, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుంతకల్లు-బేతంచెర్ల మధ్య లైన్ క్లియర్

గుంతకల్లు: గుంతకల్లు–గుంటూరు రైలు మార్గం ప్రాజెక్ట్ పరిధిలోని గుంతకల్లు–బేతంచెర్ల మధ్య 105 కి.మీల డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తయినట్లు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన గుంటూరు–గుంతకల్లు సెక్షన్‌లో డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. దాదాపు 401 కి.మీ. మేర ఉన్న ఈ రైలు మార్గానికి 2016–17 ఆర్థిక సంవత్సరంలో రూ.3,887 కోట్లను ప్రభుత్వం కేటాయించినట్లు గుర్తుచేశారు. ఇప్పటి వరకూ నల్లపాడు–జగ్గంపేట–కృష్ణాపురం మధ్య 174 కి.మీ, బేతంచెర్ల–మల్కాపురం మధ్య 25 కి.మీ, డోన్–గుంతకల్లు మధ్య 71 కి.మీ. డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. దీంతో మొత్తం 281 కి.మీ. గుంటూరు–గుంతకల్లు ప్రాజెక్ట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇదే మార్గంలోని మల్కాపురం–డోన్ మధ్య 11 కి.మీ. కేవలం రెండు నెలల్లో రికార్డు స్థాయిలో పూర్తి చేయడం గర్వ కారణమన్నారు.



దివ్య ప్రేమ నాటికలోని ఓ సన్నివేశం



పౌరాణిక నృత్య రూపంలోని ఓ సన్నివేశం



నాటికను ప్రదర్శిస్తున్న సత్యసాయి విద్యార్థులు

సత్యసాయిది 'దివ్య ప్రేమ'

ప్రశాంతి నిలయం: సత్యసాయి తన భక్తకోటికి నిస్వార్థమైన ప్రేమను పంచిన తీరును వివరిస్తూ విద్యార్థులు నిర్వహించిన నాటిక భక్తులను రంజింపజేసింది. సత్యసాయి విద్యాసంస్థల 42వ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ విద్యార్థులు ''దివ్య ప్రేమ'' పేరుతో నాటిక బుధవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత నిర్వహించారు. రామాయణంతోపాటు నిత్యం జీవితంలో మనుషుల మధ్య చోటు చేసుకునే ప్రేమపూర్వక ఘట్టాలు, సత్యసాయి భక్తకోటిపై చూపిన ప్రేమను చక్కగా ప్రదర్శించారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

యువకుడి ఆత్మహత్య



రవి (ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన రవి (19) బుధవారం రాత్రి తన మేనమామ మురుగేష్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పెయింటింగ్ పనులతో జీవనం సాగిస్తున్న రవి చిరుప్రాయంలోనే తల్లి మురగవేణి మృతి చెందడంతో తండ్రి వదిలేసి వెళ్లిపోయాడు. చిన్నప్పటి నుంచి మేనమామ మురుగేష్ ఇంట్లోనే పెరిగాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నవ దంపతుల ఆత్మహత్య

- రెండు నెలల క్రితమే పెళ్లి

రామగిరి: నవ దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మండలంలోని గంగంపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ జనార్దన్ నాయుడు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల దాదాఖలందర్ (24), బోయ జ్యోత్స్న (20) రెండు నెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ, ఇద్దరూ ఇంట్లో బుధవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ జనార్దన్ నాయుడు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.